క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

యాలాల: మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమీక్ష ఉంటుందని, కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఏక్ గంట.. ఏక్‌సాత్ శ్రమదాన్


ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్

కొడంగల్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొడంగల్ మున్సిపల్ కార్మికులు శ్రమదానం చేశారు. ఏక్ తారిక్.. ఏక్ గంట ఏక్‌సాత్ శ్రమదాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని 12 వార్డుల్లో పనులు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల దగ్గర స్థానికుల భాగస్వామ్యంతో పనులు చేశారు. పట్టణంలోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో చెత్తను తొలగించారు. విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శుభ్రతను పాటించాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై.. ఇతర పార్టీల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆనంద్ చెప్పారు. ఆదివారం మున్సిపల్ పరిధి 2వ వార్డు ధన్నారంకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఖలీల్, ఖాజా, సలీమ్‌లతో పాటు మరో 25 మంది ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరగా.. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఇంటింటికీ 'గ్యారంటీ'


ప్రచారం చేస్తున్న రవీందర్ తదితరులు

మర్పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇంటింటికీ ఆరు సంక్షేమ పథకాలు గ్యారంటీగా అమలు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. ఆదివారం మండల పరిధి తిమ్మాపూర్ గ్రామంలో పర్యటించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను గెలిపిస్తే ప్రతి కుటుంబం బాగుపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల యూత్ ప్రెసిడెంట్ సురేష్, నాయకులు బలవంత్‌రెడ్డి, నర్సింహులు గ్రామస్తులు ఉన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న నర్మద

కొడంగల్: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో బహుజనులకు న్యాయం జరగడం లేదని, అన్ని వర్గాల వారిని ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోవటం లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప ఆరోపించారు. పట్టణంలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు ఆదివారం ఆమె మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారం వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుస్స చంద్రయ్య పాల్గొన్నారు.

నిలిచిన బస్సు.. స్పందించిన సర్పంచ్‌లు

షాబాద్: హైతాబాద్ నుంచి నాందార్‌ఖాన్‌పేట్ చెరువు కట్ట మార్గంలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును నిలిపివేశారు. స్పందించిన హైతాబాద్, పెద్దవేడు, దామర్లపల్లి, లింగారెడ్డిగూడ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, లింగం, శేఖర్‌రెడ్డి గుంతలు పూడ్చి వేయించి మాట్లాడారు. బస్సు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సొంత ఖర్చులతో గుంతలు పూడ్చివేయించామని పేర్కొన్నారు.

స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం

- చెత్తను మున్సిపల్ ట్రాక్టర్లో వేయాలి
- విషజ్వరాలు సోకితే వైద్యులను సంప్రదించాలి
- స్వచ్ఛతా హీ సేవలో అధికారులు, ప్రజాప్రతినిధులు

'పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే స్వచ్ఛత నెలకొంటుంది. తద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు.. వ్యక్తిగత శుభ్రతకు శ్రద్ధ చూపాలి. తమవంతు బాధ్యతగా చెత్తాచెదారాన్ని ఇంటి ముందుకు వచ్చే పంచాయతీ, మున్సిపాలిటీ వాహనంలో వేయాలి' అని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనుల్లో వారు పాల్గొని వీధులను ఊడ్చారు.


స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

పెద్దేముల్: స్వచ్ఛత హీ సేవకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ వీరప్ప అన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వహించిన పారిశుద్ధ పనుల్లో ఆయన పాల్గొని వీధులను శుభ్రం చేశారు. పనులను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్న చోట దోమలను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వేయించాలని జీపీ కార్యదర్శికి సూచించారు. ఎవరికైనా విషజ్వరాలు సోకితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఇందులో ఉప సర్పంచ్ వెంకటయ్య, వార్డు సభ్యులు గుండప్ప, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముస్తాఫ, యువకులు అనిల్, అంజీ, గోపాల్ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

యాలాల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీఓ యాదయ్య అన్నారు. 'స్వచ్ఛత హీ సేవ'లో భాగంగా కోకట్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాల స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడి చెత్త నిర్వహణ విషయంలో గ్రామస్తులు సహకరించాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో జీపీ కార్యదర్శి సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛతే ధ్యేయం

పూడూరు: గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సర్పంచ్ నవ్య కోరారు. స్వచ్ఛత హీ సేవలో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో వేయాలని సూచించారు. ఇందులో మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు కృషి

కుల్కచర్ల: పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తున్నాని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొని మహిళా సంఘాల నేతలు, గ్రామస్తులతో కలసి పారిశుద్ధ పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత చూపాలని కోరారు. పరిసరాలు బాగుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. ప్రస్తుతం డెంగీ, వైరల్ ఫీవర్ తదితర వ్యాధులతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చెత్తా చెదారం లేకుండా..

దోమ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామాల్లో స్వచ్ఛత నెలకొంటుందని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీఓ సోమలింగంతో కలసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని, పరిసరాలు పరిశుభ్రతగా లేకపోవడం వలనే విష జ్వరాలు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం లేకుండా, మురుగు కాల్వలు సాఫీగా సాగేలా చూసుకోవాలని చెప్పారు. ఇందులో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


యాలాల: పారిశుద్ధ్య కార్మికులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీఓ

ఆరోగ్యంగా ఉంటారు..

పరిగి: పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధి రంగంపల్లిలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని, అప్పుడే కాలనీలు స్వచ్ఛతగా ఉంటాయని, తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు.

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం


ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు టౌన్: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు శ్రద్ధ చూపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న కోరారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గాంధీ చౌక్ నుంచి శివాజీ చౌక్ వరకు పరిసరాల శుభ్రతతో పాటు, డివైడర్ల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం వేయకుండా, చెత్త బుట్టల్లో వేసి మున్సిపల్ వాహనానికి అందజేయాలని చెప్పారు. కమిషనర్ షఫీవుల్లా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఇంట్లోని చెత్తను రోడ్లపై వేయకుండా బాధ్యతగా మున్సిపల్ వాహనాల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి, శానిటేషన్ జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

వికారాబాద్ అర్బన్: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యమని ఎంపీడీఓ సత్తయ్య అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిధి జైదుపల్లిలో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణాల్లో గ్రామస్తులతో కలిసి పిచ్చి మొక్కలను తొలగించారు. పచ్చదనంపై, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

31వ వార్డులో..

మున్సిపల్ పరిధి 31వ వార్డు శివరాంనగర్‌లో కౌన్సిలర్ గాయిత్రి ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడారు.


జైదుపల్లిలో శ్రమదానం చేస్తున్న ఎంపీడీఓ సత్తయ్య తదితరులు

ప్రతి రోజు పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేద్దాం

బంట్వారం: ఈ నెల 5న వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో నిర్వహించే పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేద్దామని బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ పిలుపునిచ్చారు. జన సమీకరణ పై ఆదివారం కరీంపూర్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామాల వారీగా టార్గెట్ రీచ్ కావాలని, జన సమీకరణ భారీగా ఉండాలని చెప్పారు. ఇందుకు సంబంధించి ఎవరి బాధ్యతలను వారు సక్రమంగా నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పాలమూరుకు తరలిన బీజేపీ శ్రేణులు

తాండూరు రూరల్: మహబూబ్‌నగర్‌లో ఆదివారం జరిగిన ప్రధాని మోదీ బహిరంగసభకు తాండూరు మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు శేఖాపురం ఆంజనేయులు, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, సిద్దప్ప, చిరంజీవి, నరేందర్‌యాదవ్, నక్కల రమేష్, జర్నప్పలు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ప్రోత్సహించాలి

కుల్కచర్ల: భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం కోరారు. ఆదివారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన వారే నిర్మాణరంగంలో అధికంగా ఉన్నారని, అలాంటి వారిని ప్రభుత్వం ప్రోత్సహించి, వారి ఉన్నతికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షుడు ఐలగారి కృష్ణయ్య, స్థానిక నాయకులు మైపాల్, వెంకటయ్య, యాదయ్య, శ్రీనివాస్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శేఖర్ గౌడ్

తాండూరు టౌన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ శేఖర్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆలిండియా మార్వాడీ యువమంచ్, లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న రక్తదాన శిబిరం అవగాహన ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసిన వారు ప్రాణదాతలని పేర్కొన్నారు. ఒకరి జీవితాన్ని నిలబెట్టడం వలన వారికి పునర్జన్మను ఇచ్చిన వారవుతారన్నారు. ఆరోగ్యంగా ఉండి, 18 ఏళ్ల వయసు పైబడిన వారెవరైనా రక్తదానం చేయవచ్చని, తరచూ రక్తదానం చేయడం వలన రక్తప్రసరణతో పాటు, పునరుత్పత్తి సక్రమంగా జరుగుతుందని వెల్లడించారు. ర్యాలీలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు, కౌన్సిలర్ మంకాల్ రాఘవేందర్, వీరేందర్, మన్మోహన్ సార్డా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయం


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

యాలాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరైనా భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, కమాల్‌పూర్ సర్పంచ్ బస్వరాజ్ ధీమా వ్యక్తంచేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి తనయుడు రాజేందర్‌రెడ్డితో కలిసి వారు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన వారు.. సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారారని విమర్శించారు. ప్రస్తుతం తాండూరులో పార్టీ హవా కొనసాగుతుందని, కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అన్నారం రాములు, నాగప్ప, గంతల మైనొద్దీన్, నాగయ్య, ఖాసీం, ఆరిఫ్ హుస్సేన్, నాగసముందర్ వెంకట్, ప్రశాంత్, జిలానీ, సత్యనారాయణ, మక్సూద్, అజ్జూ, చందు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించడం మన సంస్కృతి


కొడంగల్: వయోజనులను సన్మానిస్తున్న తహసీల్దార్లు

- ఈసీ ఆదేశాల మేరకు వయోజనులకు సన్మానం: తహసీల్దార్లు

కొడంగల్: పెద్దలను గౌరవించడం మన సంస్కృతి, సంప్రదాయమని తహసీల్దార్లు విజయ్‌కుమార్, వెంకటేశ్ అన్నారు. ప్రపంచ వయోజనుల దినోత్సవం సందర్భంగా ఆదివారం తహసీల్ కార్యాలయ ఆవరణలో వృద్ధులను సన్మానించి మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 80 ఏళ్లు దాటిన వారికి సన్మానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ సురేష్, మహిళా సంఘం సభ్యులు ఆనందమ్మ, వయోజనులు బొంకురు శంకరప్ప, బైండ్ల మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

తట్టెపల్లిలో..

పెద్దేముల్: తొమ్మిది పదులు దాటిన పెద్దలకు ఉన్నతాధికారుల ఆదేశానుసారం రెవెన్యూ అధికారులు సన్మానించారు. తట్టెపల్లి గ్రామంలో పన్నిబాయి, లాలమ్మ, సాలిబాయి, గోరిబిలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, ఉప సర్పంచ్ కిష్టప్ప, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, తట్టెపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజప్ప, డైరెక్టర్ హన్మంతు, మండల జూనియర్ అసిస్టెంట్ రమేష్, వార్డు సభ్యులు మైబు, శివరాం, లక్ష్మమ్మ సమక్షంలో వృద్ధులకు శాలువాలు కప్పి సన్మానించారు. 90 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ సన్మానం చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లాలప్ప, రాము, బాలప్ప, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్: వృద్ధులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

రెండు కిలోమీటర్ల ప్రయాణం నరకమే..

- అధ్వానంగా లింగన్‌పల్లి రోడ్డు
- కాంగ్రెస్ సర్పంచ్‌ననే వివక్ష
- సర్పంచ్ బల్లరాణి



దోమ: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని, చినుకు పడితే చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్రం ఆటంకం కలుగుతోందని బాధిత గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న లింగన్‌పల్లికి వెళ్లే రహదారి పూర్తి ధ్వంసమయింది. వర్షం పడితే గోతుల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి రోడ్డులో ప్రయాణించాలంటే నరకం కనబడుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు.

పట్టించుకోని పాలకులు: సర్పంచ్

గ్రామానికి సంబంధించిన అభివృద్ధి పనులను అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ బల్లరాణి ఆరోపించారు. దోమ నుంచి గ్రామానికి వచ్చే రెండు కిలోమీటర్ల రోడ్డు విషయంపై ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన గ్రామాలతో పాటు ఇతర జీపీలకు పంచాయతీ భవనాలను నిర్మించుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఒక్కో భవనానికి రూ.20 లక్షలు మంజూరు చేశారు. కానీ లింగన్‌పల్లి విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ననే వివక్ష చూపుతూ.. జరగాల్సిన అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు.


బురదమయం అయిన లింగన్‌పల్లి రోడ్డులో వరి నాట్లు వేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు (ఫైల్)

ఎలా నడవాలి?

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలు ఏర్పడి, బురదమయంగా మారి స్థానికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. చిన్నపాటి వర్షం పడితే.. చిత్తడిగా మారి, కాలి నడకన వెళ్లలేని దుస్థితని మధుకాలనీ వాసులు చెప్పారు. ఇదే విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.


మధుకాలనీ రోడ్డు దుస్థితి

హక్కుల సాధనకు పోరాటం

- సీఐటీయూ సహాయ కార్యదర్శి దేవేందర్

షాబాద్: కార్మికుల హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరూ ఐక్యంగా హక్కులు సాధించుకోవాని సూచించారు. కార్మికులకు కనీస వేతనాల అమలు కోసం పాలకవర్గాలపై నిరంతరం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు సత్తయ్య, చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు భాస్కర్, తిర్మలాపూర్ సీఐటీయూ నాయకులు భీమయ్య, కృష్ణ, లక్ష్మయ్య, అర్జున్, రవి, రత్నమ్మ, బాబయ్య, అనంతయ్య, వెంకటయ్య, యాదయ్య, పగులయ్య తదితరులు పాల్గొన్నారు.


తిర్మలాపూర్‌లో సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న దేవేందర్

ప్రవక్త మార్గంలో పయనించాలి


మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో ముస్లింలు

- మానవాళి శ్రేయస్సుకు ప్రార్థించాలి
- మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో వక్తలు

దోమ: మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మైనార్టీ సంఘం బొంపల్లి నేతలు మహమ్మద్, మోహిన్‌పాష, కలీంఖాన్, మోహిన్‌హకీద్ సూచించారు. మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో భాగంగా ఆదివారం మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ విధుల్లో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతిని బోధించారని చెప్పారు. యువత ఆయన మార్గంలో పయనిస్తూ ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం ప్రార్థించాలని సూచించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు మోయిజ్, బషీర్, హైమద్, ఫెరోజ్, ఫరీద్, ముబేర్, రహీం, రియాజ్, సలీం, అమీర్‌ఖాన్, షాకేర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

మాదాసి కుర్వలు ఏకమవ్వాలి

- సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వితలయ్య

నందిగామ: మాదాసి కుర్వలు ఏకమైతేనే ఎస్సీ సర్టిఫికెట్లు సాధ్యమవుతాయని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వితలయ్య అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో శనివారం రాత్రి సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా శంకరయ్య, అధ్యక్షుడిగా శేఖర్, ఉపాధ్యక్షుడిగా బీరప్ప, ప్రధాన కార్యదర్శిగా బాలరాజు, సంయుక్త కార్యదర్శిగా మల్లేశ్, కోశాధికారిగా వెంకటేశ్, సభ్యులుగా బీరప్ప, శేఖర్, శేఖర్, శ్రీనివాస్, శ్రీశైలం తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సత్తయ్య, వెంకటేశ్, నారాయణ, శ్యామలీల, శ్రీను, శ్రీకాంత్, రమేశ్, మల్లేశ్, రామకృష్ణ, సాయిలు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.